క్లుప్తంగా

పార్టీ కోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు



ధనంజయరెడ్డిని సన్మానిస్తున్న నారాయణస్వామి

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. పార్టీ జిల్లా కోశాధికారిగా నియమితులైన పుత్తూరు ధనుంజయరెడ్డిని బుధవారం ఉప ముఖ్యమంత్రిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం, ట్లాడుతూ క్రియాశీలకంగా పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. తనపై నమ్మకం ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎంపిక



పురుషోత్తం

పుత్తూరు రూరల్: తిరుపతి జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా పుత్తూరుకు చెందిన ఎస్.పురుషోత్తం ఎంపికయ్యారు. శ్రీకాళహస్తిలో జరిగిన జిల్లా మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. పుత్తూరుకు చెందిన విజయ్, ప్రవీణ్‌కుమార్, యూసిఫ్‌బాషా జిల్లా కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

వేడుకగా శ్రావణపౌర్ణమి పూజలు

నిండ్ర: కూనమరాజు పాళెంలో శ్రీ మహాలక్ష్మి ఆలయంలో బుధవారం శ్రావణ పౌర్ణమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పూర్ణాహుతి, పంచ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే హరికథ నిర్వహించారు. కార్యక్రమంలో తడుకుపేట గ్రామస్తులు, గీతామందిర ఆశ్రమ పీఠాధిపతులు వరదానంద స్వామి పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు చట్టాలపై అవగాహన

నగరి: స్థానిక బస్టాండ్ ప్రాంగణంలోని అసంఘటిత కార్మికులకు సీనియర్ న్యాయవాది త్యాగరాజు చట్టాలపై అవగాహన కల్పించారు. బుధవారం బస్టాండ్ ప్రాంగణంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించిన ఆయన కార్మికుల సంక్షేమ చట్టాలను వివరించారు. బీమా ఆవశ్యతను వివరించారు. న్యాయస్థానాన్ని ఎలా సంప్రదించాలో వారికి స్పష్టం చేశారు.

దస్తావేజులను ఆన్‌లైన్ చెయ్యొద్దు

నగరి: ఆస్తుల కొనుగోలు, విక్రయాలకు సంబంధించిన దస్తావేజుల ప్రాంతంలో డిజిటల్ దస్తావేజులను తీసుకురావద్దంటూ దస్తావేజులేఖరులు, విక్రయదారులు, దస్తావేజులపై కంప్యూటర్ ప్రింట్‌లు తీసే ఆపరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి సబ్‌రిజిస్ట్రార్ సుబ్రమణ్యంకు వినతి పత్రం అందజేశారు. డిజిటలైజ్ చేయడం వల్ల పొరపాట్లు తలెత్తే అవకాశం ఉందని, పలువురు ఉపాధి కోల్పోతారని ప్రస్తుతం ఉండే పద్ధతులనే కొనసాగించాలని కోరారు.


వైభవంగా యజ్ఞోపవేతధారణ



యజ్ఞోపవేతధారణలో బ్రాహ్మణ సంఘ సభ్యులు

నగరి: శ్రీవాణి గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో బుధవారం యజ్ఞోపవేతధారణ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రుగ్వేద, యజుర్వేద ఉపాకరణ చేసిన అనంతరం సంఘ కార్యదర్శి వి.శివకుమార్ శర్మ యజ్ఞోపవేతం అందించగా మార్గబంధుశర్మ మంత్రోచ్ఛరణ చేసి యజ్ఞోపవేతధారణ చేయించారు. కార్యదర్శి వి.శివ కుమార్‌శర్మ యజ్ఞోపవేతం అందరికీ ఇచ్చారు. సంఘ అధ్యక్షుడు ఓ.బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు పురాణం నవీన్, కోశాధికారి కేవీ సురేష్ శర్మ పాల్గొన్నారు.

దేవరెద్దు అపహరణకు యత్నం



ఎద్దు చోరీకి యత్నించిన తమిళనాడు ముఠా

పెనుమూరు(కార్వేటినగరం): కలిగిరికొండపై దేవస్థానానికి చెందిన దేవరెద్దు అపహరణకు కొందరు వ్యక్తులు యత్నించిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. పెనుమూరు మండలంలోని కలిగిరి కొండపై భక్తులు మొక్కుబడిగా గోవులను స్వామివారికి ఇస్తుంటారు. అలా భక్తులు మొక్కుబడిగా ఇచ్చిన ఓ దేవరెద్దును బుధవారం తమిళనాడుకు చెందిన కొందరు ఎల్లంపల్లి వద్ద అక్రమంగా ఆటోలో తరలించేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికులు గుర్తించి, పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు తమిళనాడుకు చెందిన వారిని అదుపులోకి తీసుకుని, విచారణ జరుపుతున్నారు.

సారా కేసులో ఏడాది జైలు శిక్ష

పుత్తూరు రూరల్: సారా కేసులో ప్రశాంత్(28) అనే వ్యక్తికి పుత్తూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.గోపాలకృష్ణ ఏడాది జైలుశిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు చెప్పినట్లు స్థానిక ఎస్ఈబీ సీఐ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పుత్తూరు మండలం ఉత్తరపు కండ్రిగ గ్రామానికి చెందిన ప్రశాంత్ 2021, ఆగస్టు 29న 10 లీటర్ల సారాతో పట్టుబడినట్లు చెప్పారు. నేరం రుజువు కావడంతో జడ్జి ఈ మేరకు తీర్పు చెప్పినట్లు సీఐ పేర్కొన్నారు.

సున్నావడ్డీతో ఆర్థిక స్వావలంబన

- మహిళలకు నాలుగో విడత నిధులు
- హామీ నిలబెట్టుకున్న సీఎం జగనన్న



సున్నావడ్డీ జమతో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు (ఫైల్)

పాలసముద్రం: మహిళల ఆర్థిక స్వావలంబనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అక్కచెల్లెమ్మలకు సున్నావడ్డీ చెల్లింపు పథకాన్ని ప్రతి ఏడాది క్రమం తప్పకుండా చెల్లిస్తోంది. వరుసగా నాలుగో విడత పంపిణీ ఈనెల 11న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ చేశారు.

నియోజకవర్గంలో రూ.9.27 కోట్లు

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఉన్న 10,814 గ్రూపులకు రూ.9.27 కోట్ల మేర సున్నా వడ్డీ రూపంలో చెల్లించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించారు. డ్వాక్రా గ్రూపు సభ్యులకు బ్యాంక్‌లు ఇచ్చిన రుణాలకు వడ్డీ చెల్లింపు లేకుండా ప్రభుత్వం చెల్లించే విధంగా సున్నావడ్డీ ఇస్తానని ప్రకటించారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మహిళల ఖాతాల్లో నగదు జమచేస్తున్నారు. దీంతో డ్వాక్రా మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలకు రుణాలు ఇచ్చి వడ్డీ సహా బ్యాంక్‌లు వసూలు చేసేవారు. మహిళలకు పసుపు–కుంకుమ పేరిట కన్నీళ్లు తుడవడానికి రూ.10 వేలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఈ పథకాల వల్ల మహిళలకు ఒరిగిందేమీ లేదు. బ్యాంక్‌లకు వడ్డీ, చక్రవడ్డీ సహా చెల్లించేందుకు నానా ఇబ్బందులు పడేవారు.

2019-20 మొదటి విడత జమ అయిన నగదు (లక్షల్లో)

మండలం	గ్రూపులు	సభ్యులు	చెల్లించింది
గంగాధరనెల్లూరు	1,319	13,190	3.68
శ్రీరంగరాజపురం	811	8110	2.01
కార్వేటినగరం	944	9440	2.33
వెదురుకుప్పం	938	9,380	2.29
పెనుమూరు	851	8,510	2.36
పాలసముద్రం	458	4,580	1.29

2020-21 : 2వ విడత జమ అయిన నగదు (లక్షల్లో)

మండలం	గ్రూపులు	సభ్యులు	చెల్లించింది
గంగాధరనెల్లూరు	1,384	13,840	2.73
శ్రీరంగరాజపురం	941	9,410	1.81
కార్వేటినగరం	1,031	10,310	1.84
వెదురుకుప్పం	1,009	10,090	1.59
పెనుమూరు	929	9,290	2.00
పాలసముద్రం	472	4,720	1.07

2021-22 : 3వ విడత జమ నగదు లక్షల్లో

మండలం	గ్రూపులు	సభ్యులు	చెల్లించింది
గంగాధరనెల్లూరు	1,362	13,620	2.59
శ్రీరంగరాజపురం	923	9,230	1.73
కార్వేటినగరం	1,049	10,490	1.82
వెదురుకుప్పం	952	9,520	1.48
పెనుమూరు	935	9,350	1.95
పాలసముద్రం	491	4,910	1.20

2022-23 : 4వ విడత జమ నగదు లక్షల్లో

మండలం	గ్రూపులు	సభ్యులు	చెల్లించింది
గంగాధరనెల్లూరు	1,145	11,450	1.59
శ్రీరంగరాజపురం	810	8,100	1.06
కార్వేటినగరం	946	9,460	1.33
వెదురుకుప్పం	651	6,510	0.78
పెనుమూరు	766	7,660	1.09
పాలసముద్రం	402	4,020	0.57

సున్నావడ్డీ పథకం ఓ వరం



సున్నావడ్డీ పథకం మహిళలకు వరంలా మారింది. గత ప్రభుత్వాల హయాంలో తీసుకున్న రుణాలు చెల్లించలేక ఇబ్బందిపడేవాళ్లం. గతంలో తీసుకున్న రుణాలకూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నావడ్డీ పథకాన్ని ప్రకటించి సులువుగా తీర్చుకునేలా చేశారు. ఆయనకు డ్వాక్రా మహిళలు అండగా ఉంటారు. సున్నావడ్డీ పథకాన్ని డ్వాక్రా మహిళలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అందజేస్తాం. సున్నావడ్డీ నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నాం. – వి.శోభ, సంఘమిత్ర, ఎస్‌కేఆర్ పురం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సున్నావడ్డీ వరుసగా నాలుగో విడత అక్కచెల్లెమ్మలకు డ్వాక్రా మహిళల ఖాతాల్లో ఈనెల 11వ తేదీన బటన్ నొక్కి జమ చేశారు. గతంలో బ్యాంకుల్లో తీసుకున్న రుణాలకు వడ్డీలు కట్టుకుని ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. జగనన్న కారణంగా ధైర్యంగా రుణాలు తీసుకుని కట్టుకుంటున్నాం.

– ఏ.లిల్లీ, డ్వాక్రా సంఘ సభ్యురాలు

ఖాతాల్లో జమ చేస్తున్నాం



మండలంలో డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ పథకాన్ని మూడో విడత ఎటువంటి ఆటంకాలు లేకుండా అందజేశాం. నాలుగో విడత ఈ నెల 11న ముఖ్యమంత్రి విడుదల చేశారు. మహిళలకు సున్నావడ్డీ పథకం నిధులను వారివారి ఖాతాల్లో జమ చేస్తాం. ఆర్థికాభివృద్ధికి ఈ నిధులను వినియోగించుకోవాలి.

– పరిదు మస్తాన్, ఐకేపీ, ఏపీఎం, పాలసముద్రం

అవయవదానం ప్రాణం పోస్తుంది



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా

- మంత్రి ఆర్కే రోజా

నగరి: అన్నదానం ఆకలి తీరుస్తుందని, అక్షర దానం అజ్ఞానాన్ని తొలగిస్తుందని, భూదానం ఉపాధి కల్పిస్తుందని, అవయవదానం ప్రాణం పోస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం ఆమె తమిళనాడు వేలూరు నారాయణి హాస్పిటల్, రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవయవ దాన దినోత్సవంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, పెద్దలు ప్రతిఒక్కరూ ఈ అవయవ దానం ఆవశ్యకతను నిండు మనస్సుతో ఆలోచించాలన్నారు. చనిపోయినా చేయగలిగేదానం అవయ దానం అన్నారు. నారాయణి హాస్పిటల్ శ్రీశక్తిఅమ్మ ఆశీస్సులతో నడుస్తోందని ఎంతో మందికి వైద్య సేవలు అందిస్తోందన్నారు. అక్కడితో బాధ్యత తీరిపోయిందని భావించక అవయవదానంపై అవగాహన పెంచాలని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. కరోనా ప్రభావంతో అవయవ దానం చేసే వాళ్ల సంఖ్య మరింత తగ్గిపోయిందని అనుమానాలు, అపోహలు విడిచి అవయవదానం చెయ్యాలని ప్రజలకు సూచించారు. రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, ఆస్పత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

పాలసముద్రం: గర్భిణుల ఆరోగ్యంపై ఆరోగ్యసిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. మోహన్‌క్రిష్ణ మాట్లాడుతూ మాతా శిశు మరణాలు తగ్గించాలంటే ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవం చేసుకోవాలన్నారు. గర్భిణులు ప్రసవించే వరకు ఏఎన్ఎం, ఆశావర్కర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎం గంగాగౌరి పాల్గొన్నారు.

దేశమ్మ ఆలయ గుత్తహక్కుల ఆదాయం రూ.5.85 లక్షలు



వేలం నిర్వహణలో అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు

నగరి: దేశమ్మ ఆలయానికి గుత్తహక్కుల వేలం ద్వారా రూ.5.85 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు అన్నారు. బుధవారం ఆలయ ఆవరణలో గుత్తహక్కులకు వేలం పాట నిర్వహించారు. అమ్మవారి కీచైన్లు, దారాలు, ఫొటోలు అమ్ముకునే హక్కుకు రూ.లక్ష, భక్తులు సమర్పించే చీరలు, జాకెట్లు పోగుచేసుకునే హక్కుకు రూ. 1.10 లక్షలు, సజీవ కోళ్ల పోగుచేసుకునే హక్కుకు రూ.లక్ష, వాహన రుసుము వసూలు చేసుకునే హక్కుకు రూ.1.60 లక్షలు, దుకాణంలో కూల్‌డ్రింక్స్, టీ, కాఫీ, బజ్జీ, బోండా అమ్ముకునే హక్కుకు రూ.1.15 లక్షలు చొప్పున వేలం పాటలో కేటాయించారు. దీంతో ఆలయానికి రూ.5.85 లక్షల ఆదాయం లభించింది. గత ఏడాది రూ.4.56 లక్షలు ఉన్న ఈ గుత్త హక్కుల ఆదాయం ఈ ఏడాది రూ.1.29 లక్షలు పెరిగిందని చైర్మన్ తెలిపారు. తలనీలాలు వేలం హక్కుకు రెండుసార్లు వేలం నిర్వహించినా ఎవరూ రానందున వాయిదా వేశామన్నారు. ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనితారెడ్డి

గంగాధరనెల్లూరు: మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అనితారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి తెలిపారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీదేవి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమా వేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అనంతరం రాఖీ పండుగ సందర్భంగా వైస్ ఎంపీపీ హరిబాబుకు ఎంపీపీ, ఎంపీడీఓ రాఖీ కట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇన్బనాథన్, ఎంపీటీసీలు, సర్పంచ్లు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర



అలంకరణలో గంగమ్మ



అలంకరణలో శివగంగై అమ్మ



అగ్గికుండలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

నగరి: స్థానిక కొత్తపేటలో గంగజాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాల మధ్య గంగమ్మ ఊరి మధ్యలో వేసిన వేపాకు గుడిసెకు వచ్చి చేరింది. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి చీరలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేపాకు సారెలు, వెయ్యికన్నుల దుత్తల్లో దీపాలు సమర్పించారు. తడిబట్టలతో అంగప్రదక్షిణ చేశారు. పసుపుదుస్తులు ధరించి అగ్గికుండలు చేతపట్టి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. జాతర ప్రాంతంలో కొలువుదీరిన భవాని, ఎల్లమ్మ, శివగంగై దేవతల అలంకరణ అందరినీ అలరించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, వినూత్న ప్రదర్శనలు భక్తులను అలరించాయి. గంగమ్మను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కుంభం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి పొలిమేర దాటించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచివుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్సకు వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా విజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబార్, రసం, పెరుగు అన్నం , చిక్కీ, అరటిపండును అందించారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్స్ నారాయణ స్వామి, పుష్ప పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



గడప గడపలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం: పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం ఆయన అమ్మపల్లి, కేపీ అగ్రహారం పంచాయతీలోని అమ్మపల్లి, ఏఎంఆర్ కండ్రిగ, కృష్ణాపురం, పొన్నగల్లు, రాచపాళ్యం, కేపీ అగ్రహారం బీసీ కాలనీ, జాండ్లపేట, జాండ్లపేట ఎస్టీ కాలనీ, సూరయ్యపాళ్యం ఎస్సీకాలనీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులు సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమాలు అందిస్తోందన్నారు.పేదల పాలిట కల్పవృక్షంగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రతిఒక్కరూ ఆదరించి రానున్న ఎన్నికల్లో ఘన విజయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు అధికారం కోసం తహతహలాడుతున్నాడని అతనికి ఓట్లు వేస్తే రాష్ట్రం 30 సంవత్సరాల అభివృద్ధిలో వెనుక్కి వెళ్లి పోతుందన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమాలకు లబ్ధిదారులు మంత్రులు, ఎమ్మెల్యేలను చిరునవ్వుతో ఆహ్వానిస్తూ, మంగళహారతులు పడుతున్నారని తెలిపారు. పేదల ఆశీర్వాదాలే మాకు శ్రీరామ రక్ష అన్నారు. అదేవిధంగా ఏఫ్‌సీఎస్ సంఘం అధ్యక్షుడు కుమార్ రెడ్డి కృష్ణాపురం జలాశయంలో చేపపిల్లలు కావాలని మంత్రి దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన మంత్రి ఫిషరీస్ అధికారులతో మాట్లాడి స్పెషల్ స్కీం కింద మూడు వేల చేపల పిల్లలను ఇవ్వాలను ఆదేశించారు.

నేను జగనన్నతోనే ఉంటా..

నేను నా జీవితం ఉన్నంత వరకు సీఎం జగనన్న, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితోనే ఉంటానని అన్నారు సర్పంచ్ సుందర్‌రాజ్ ఉప ముఖ్యమంత్రిపై ఒట్టేసి చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భారతి, శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ రాధికారెడ్డి, ఎంపీపీ లత, కృపాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యర్శి బాలాజి, జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, కోఆప్షన్‌మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, ధనంజయవర్మ, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, ఎంపీటీసీ దేశమ్మ, సర్పంచ్ పవన్, నేతలు ధనశేఖర్‌వర్మ, చిన్నబ్బమండడి, కుమార్ రెడ్డి, మునేంద్రరెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళీ, డీటీ లక్ష్మీపతి, ఎంఈఓ విజయకుమార్ పాల్గొన్నారు.

పిల్లలు అప్రమత్తంగా మెలగాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రాఘవేంద్ర

- సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర



హాజరైన విద్యార్థినులు

పుత్తూరు రూరల్: పిల్లలు తమ సమీప వ్యక్తుల పట్ల అప్రమత్తంగా మెలగాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ.రాఘవేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతినేరం బ్యాడ్ టచ్ ద్వారా ప్రారంభమవుతుందని తెలిపారు. బ్యాడ్ టచ్ అంటే అవసరం లేకుండా చేసే పని అని, ఇలాంటి పనులకు పిల్లలు దూరంగా ఉండాలన్నారు. పిల్లలు తమ సమీప బంధువుల వద్ద కూడా అప్రమత్తంగా మెలగాలని సూచించారు. బ్యాడ్ టచ్‌గా గుర్తించిన పిల్లలు వెంటనే నో (వద్దూ) అంటూ బిగ్గరగా అరవాలని చెప్పారు. గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలియజెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. లైంగిక వేధింపుల నుంచి పిల్లలు ఇంట, బయట అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంట్లో దిశా యాప్ కలిగిన ఫోన్ ఉండాలన్నారు. ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, ఇన్‌చార్జి హెచ్ఎం శోభనాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరిత

శ్రీరంగరాజపురం: ప్రజా సమస్యలకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీపీ సరిత తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, లబ్ధిదారులను గుర్తించడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణంతో పాటు, మరుగుదొడ్ల నిర్మాణానికి అదనంగా రూ.18 వేలు అందిస్తున్నామన్నారు. రైతులు తాము పండించిన పంటలకు ఈక్రాప్ నమోదు తప్పకచేసుకోవాలని పేర్కొన్నారు. మండలంలో ఉన్న రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సెప్టెంబర్ నుంచి 24 గంటలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మండలంలో ఉన్న 28 పాఠశాలలను నాడు–నేడు ద్వారా అభివృద్ధి పరుస్తున్నామన్నారు. రానున్నది ఎన్నికలు కాలం కావున గ్రామాల్లో సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించి ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జెడ్పీటీసీ రమణ ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దార్ లోకనాథపిళ్లై, ఈఓపీఆర్డీ పురుషోత్తం, డీసీసీ బ్యాంక్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వరునికి రుద్రాభిషేక పూజలు



యాగ పూజలు చేస్తున్న వేదపండితులు

పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం రుద్రాభిషేక, యాగశాల పూజలు చేశారు. ఉదయం భక్తులు యాగశాలకు కావలసిన పూజాసామగ్రితో మంగళవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగించి స్వామివారికి సమర్పించారు. వేదపండితులు నవగ్రహ, శాంతి హోమపూజలు చేశారు. హోమం నిర్వహించిన కలస నీటితో స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం స్వామివారికి అభిషేకాలు చేసి సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు



పురవీధుల్లో విహరిస్తున్న వేణుగోపాలస్వామి

కార్వేటినగరం: వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు కనులపండువగా ముగిశాయి. బుధవారం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన వంటి నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌ను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి పురవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింట కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.